www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 31 జనవరి 2023

మండల బౌద్ధ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - కౌటాల

మండల బౌద్ధ కమిటీ ఎన్నిక సోమవారం మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్ ప్రాంగణంలో తాలుకా అధ్యక్షుడు బసార్కర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా దుర్గం జీవన్‌దాస్, మండలాధ్యక్షుడిగా పూలబోగి బండురావు, కోశాధికారిగా గోంగ్లె సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా కొండగొర్ల దేవాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు బౌద్ధులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సరితతో కలిసి పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జాఫర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కిరణ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



'గంగానది'ని తోడేస్తున్నారు..!

- యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక దోపిడీ
- వీడీసీల ఆధ్వర్యంలో రూ.లక్షల్లో వేలం పాటలు
- ప్రతి ఏటా ఇదే తంతు..అయినా పట్టింపు కరువు
- అక్రమార్కులకు అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు
- 'మామూలు'గా తీసుకుంటున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

జలసవ్వడులతో గలగలపారే పెన్‌గంగానది ప్రమాదపుటంచుల్లోకి వెళ్తోంది. నిండైన ఇసుకతో నీటిని నిల్వ చేసుకుంటూ కళకళలాడాల్సిన ఈ జీవనది బోసిపోయే పరిస్థితి కనిపిస్తోంది. కొందరు అక్రమార్కులు నదీ గర్భంలోంచి ఇసుకను యథేచ్ఛగా తోడేస్తుండటంతో జీవచ్ఛవంలా మారుతోంది. ఈ అక్రమ దందాను అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులకు వంత పాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఈ దందా లాభసాటి వ్యాపారంగా మారుతోందని తెలుస్తోంది. ప్రతి ఏటా అడ్డూఅదుపు లేకుండా ఇదే తంతు కొనసాగుతున్నా అడ్డుకునేవారు లేకుండా పోతున్నారు. రెవెన్యూ అధికారులు ఎవరైనా ఫిర్యాదు చేసిన సమయంలో ఒకట్రెండు ట్రాక్టర్లు పట్టుకొని హడావుడి చేయడం..మళ్లీ వదిలిపెట్టడం షరామామూలుగా మారుతోంది. దీంతో ఇసుక దోపిడీదారులకు కూడా ఈ పరిణామం అలవాటుగా మారింది. కొన్ని గ్రామాల్లోని వీడీసీలు కూడా వేలం పాటలు నిర్వహించి ఇసుక తరలించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జైనథ్

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం నదులను తోడేయడాన్ని నిషేధించింది. భూగర్భజలాలు తక్కువగా ఉన్న చోట ఇసుక తరలింపును నిలిపివేసింది. ఇది వరకే భూగర్భజలశాఖ అధికారులు కూడా పెన్‌గంగా నది నుంచి ఇసుకను తీసుకెళ్తే భూగర్భజలాలకు ప్రమాదమని జిల్లా కలెక్టర్‌కు నివేదిక సైతం అందజేశారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన అంశాన్ని సైతం జిల్లా, మండల స్థాయి అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటినేమీ పట్టించుకోవడం లేదు. రోజూ నది సరిహద్దు గ్రామాల నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు దృష్టి సారించడం లేదు. జాతీయ రహదారితో పాటు ప్రధాన రహదారి మీదుగా నిర్భయంగా ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా వారిని పట్టుకోవడం లేదు. కొన్ని సందర్భాల్లో ఒకటి రెండు ట్రాక్టర్లను పట్టుకొని హడావుడి చేస్తున్నారు. కానీ ఆయా సరిహద్దు గ్రామాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లు ఇసుకను తీసుకెళ్లడం..నదుల వద్ద ఇసుక డంపులు ఏర్పాటు చేయడంతో పాటు ఏకంగా జేసీబీ సాయంతోనూ నదీ భూగర్భం నుంచి ఇసుకను తోడేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఆయా మండలాలకు రెవెన్యూ, జిల్లా మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

రూ.లక్షల్లో వేలం పాటలు..!

మరోపక్క గంగానది పరివాహక ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)ల ఆధ్వర్యంలో ఇసుక వేలం పాట నిర్వహిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో చెల్లించేందుకు ముందుకొచ్చిన వారికి ఆయా గ్రామాల సరిహద్దుల నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతులిస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న ఇసుక పరిమాణాన్ని ప్రకారం ధరలు నిర్ణయిస్తున్నారు. జైనథ్, బేల, భీంపూర్ మండలాల సరిహద్దు గ్రామాల్లో ఈ దందా అనేక ఏండ్లుగా సాగుతోంది. జైనథ్ మండలంలో డొల్లారలో రూ.35లక్షలు, సాంగ్వీలో రూ.19.50లక్షలు, ఆనంద్‌పూర్‌లో రూ.25.50లక్షల వరకు ధర పలికినట్లు తెలిసింది. వీటితో పాటు పెండల్‌వాడ, కౌట గ్రామ సరిహద్దులతో పాటు బేల మండలం సాంగిడి, కొగ్దూర్, మాంగ్రూడ్ గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల సాంగిడిలో అధికారులు తొమ్మిది ట్రాక్టర్లను పట్టుకోగా.. ఇందులో ఎనిమిది ట్రాక్టర్లు పారిపోయినట్లు చెబుతున్నారు. ఇలా అడపాదడప తనిఖీలు చేస్తూ నామమాత్రంగా పట్టుకొని వదిలేస్తున్నారు.





అధికారులకు తెలిసినా..!

జిల్లా సరిహద్దులోని పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుకను తీసుకెళ్తున్నారని సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే అక్రమార్కులు ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నదుల్లో ఇసుకను తోడేయడం నిషేదం ఉన్నా అలాంటి నిబంధనలను అధికారులు పక్కన పెట్టేస్తున్నారు. కొన్ని చోట్ల ఏకంగా నదిలోనే జేసీబీని పెట్టి నదీ గర్భంలోంచి ఇసుకను తీస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తిచూడటం లేదు. మరోవైపు అడ్డుకోవాల్సిన మైనింగ్ అధికారులు రెవెన్యూ అధికారులపై నెట్టివేస్తున్నారు. ఈ రెండుశాఖల మధ్య సమన్వయం లేకపోవడం ఇసుక దోపిడిదారులకు కలిసివస్తోంది. నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఆయా సరిహద్దు గ్రామాల నుంచి జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాలకు తరలిపోతున్నా అధికారులెవరూ దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై జిల్లా మైనింగ్‌శాఖ ఏడీ రవిశంకర్‌ను వివరణ కోరగా.. పెన్‌గంగా నది నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. తాము తనిఖీలు చేస్తున్నామని, స్థానిక రెవెన్యూ అధికారులు కూడా దృష్టిసారిస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

రైతు ఆత్మగౌరవాన్ని సాదిద్దాం



నవతెలంగాణ-భీమారం

రైతుకు నిజమైన ఆత్మగౌరవం దక్కినప్పుడే.. రైతే రాజు అనే నినాదం నిజమౌతుందని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కట్కూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రైతు హక్కుల సాధన వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ సుధాకర్, ఆ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్‌సాగర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమితి రైతు సంక్షేమం, నిజమై ఆత్మగౌరవంతో పాటు గిట్టుబాటు ధర కల్పించేందకు పార్టీలకు అతీతంగా పోరాడుతోందని అన్నారు. దేశానికి వెన్నుముక అయినటువంటి జైజవాన్-జైకిసాన్ అనే నానుడి నిజం చేసేందుకే తెలంగాణ రైతు హక్కుల పోరాట సమితి పని చేస్తోందని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు రైతే రాజని నినాదం కేవలం నినాదంగానే మిగిలిపోతోందని, నిజమైన గౌరవం దక్కకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ, కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని సమన్వయం చేస్తూ రైతంటే రాజు అన్న నినాదాన్ని నిజం చేయాలన్న లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. నిజమైన ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మండలంలోని వివిధ పంటలు పండిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు తిరుపతిరెడ్డి, నరహరి మహేందర్‌రెడ్డి, కలగూర రాజ్‌కుమార్, మెండె మల్లేష్ యాదవ్, వనపర్తి రవీందర్, దుర్గం లాజర్, బెల్లంకొండ భరత్‌రెడ్డి, కంకనాల సుధాకర్‌రెడ్డి, మాటేటి కొమురయ్య, భుక్య రాజునాయక్, సూరం సంజీవ్, మారం మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల ప్రచార కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలలో ప్రవేశాల నిమిత్తం రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు రూపొందించిన పాలిసెట్-2023 ప్రచార కరపత్రాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉపాధి మరియు ఉన్నత విద్యలో మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్న సీట్లు భర్తీ కావాలని శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రకాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్‌పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష మే 17న జరగనుంది. ప్రవేశ పరీక్షల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగా వివిధ కోర్సుల్లో సీట్ల భర్తీ జరుగుతుంది. ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులలో 60 సీట్లు చొప్పున ఉన్నాయి. పాలీసెట్ - 2023 దరఖాస్తుల్ని ఏప్రిల్ 24వ తేదీ వరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పదోతరగతి పూర్తయిన, చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. పాలీసెట్ 2023కు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. కార్యక్రమంలో సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ, హెచ్‌ఓడిలు రాజ్‌కుమార్, సుజయ్, పరిపాలన అధికారి రాజేష్ పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సు ప్రయాణం సురక్షితం



నవతెలంగాణ-నిర్మల్

ఆర్‌టీసీ బస్సు ప్రయాణం సురక్షిత ప్రయాణమని డిపో మేనేజర్ సాయన్న అన్నారు. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో సోమవారం ప్రజల వద్దకు ఆర్‌టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాక్‌పట్ల గ్రామానికి రోజుకు 8 ట్రిప్పులు బస్సులు నడుపుతున్నామన్నారు. సుమారు 30 మంది దివ్యాంగులకు 50శాతం రాయితీతో కూడిన బస్ పాసులు ఇస్తున్నామన్నారు. స్కూల్ పిల్లలకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కలిపిస్తున్నామన్నారు. కానీ కిలో మీటర్లకు సరిపడా ఆదాయం రావడం లేదని, బస్సు నడపడం కష్టంగా ఉందని తెలిపారు. బస్సు ముందరే ఆటోలు పెడుతున్నారని, బస్సు ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. ప్రయివేట్ వాహనాలలో ప్రయాణించకుండా ఆర్‌టీసీ బస్సులో ప్రయాణించి ఆదరించాలన్నారు. ఆదాయం పెరిగితే అదనంగా ట్రిప్పులు వేస్తామని, కోరిన సమయానికి బస్సు పంపుతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్చల్ గంగారెడ్డి, వీడీసీ సభ్యులు రాందాస్, శేఖర్‌రెడ్డి, కట్టమర గంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గోపిగౌడ్, డాక్టర్ రమేష్, ఆర్‌టీసీ సిబ్బంది ఎల్.నర్సయ్య, టివి.రమణ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఎంపిక కోసం దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: 2023-24 సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి జిల్లాలోని ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్(రెసిడెన్షియల్) పథకంలోని ఎన్నుకోబడిన ఎస్సీ విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతి, ప్రతి విద్యార్థికి 42వేల చొప్పున చెల్లించబడతాయని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ (నాన్ రెసిడెన్షియల్) పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ ఫీజు ప్రతి విద్యార్థికి 28వేల చొప్పున చెల్లించబడినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి మూడో లోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కంటి వెలుగు'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కంటి వెలుగు శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. మీడియా ప్రతినిధులకు కంటి పరీక్షలు, చూపును బట్టి కళ్లద్దాలు పంపిణీ, డేటా ఎంట్రీ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 నుండి ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని 33 టీమ్‌ల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటి పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో రెండు బఫర్ టీమ్‌ల ద్వారా ముఖ్య ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా కలెక్టరేట్, బెటాలియన్‌లలో ఇప్పటికే నిర్వహించామని, మీడియా ప్రతినిధులకు ఈ రోజు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్క అడల్ట్‌కు పరీక్షలు నిర్వహించి అవసరమైన పక్షంలో రీడింగ్ గ్లాసులు తక్షణమే అందిస్తున్నామని, డాక్టర్లు ధ్రువీకరించిన ప్రిస్క్రిప్డ్ అద్దాలకు ఇండెంట్ పంపిస్తున్నామని, అవి నేరుగా లబ్దిదారునికి ఆశా కార్యకర్తల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. మొదటి విడతలో సుమారు 1,49,000 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగిందని, రెండవ విడతలో జిల్లాలోని అర్హత గల వారందరికీ స్క్రీనింగ్ నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వారి పరిధిలోని ప్రతి ఇంటింటికి వెళ్లి కంటి వెలుగుపై ఆహ్వాన పత్రాలు అందజేస్తూ వివరించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగ పరచుకొని వారి దృష్టి లోపాన్ని నవరించుకునే విధంగా క్యాంపులకు హాజరు కావాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో టీమ్‌ల అటెండెన్స్, ఇతర డేటా ఎంట్రీ వివరాలపై సంబంధిత సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్. భీమ్ కుమార్, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సాధన, మనోహర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.శ్రీకాంత్, డా.విజయసారథి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇతరులపై విమర్శలు సరికాదు

- బీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్



నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలం అన్ని విధాలుగా వెనుకబడి ఉందని, ఎమ్మెల్యే మూడు సార్లు అధికారం చేపట్టినా అభివృద్ధి మాత్రం శూన్యమని, దీనిపై ఆలోచించకుండా ఇతరులపై విమర్శలు చేయడం సరైందికాదని బీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌పై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలో రోడ్లు, రవాణా సౌకర్యం, డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమస్యలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. పోడు రైతులకు పట్టాలిప్పిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని తెలిపారు. మరోసారి ఇలాంటి చులకన మాటలు మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్‌చాంద్ పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి : ఎమ్మెల్యే కోనప్ప



నవతెలంగాణ - కౌటాల

సమాజంలో ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. అన్ని దానాల కంటే అన్నదానం మహాదానమని కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని మన్నెవార్ కొలావార్ సేవా సంఘం భవనంలో సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమన్నారు. మారుమూల గ్రామాల నుండి ప్రతి సోమవారం సంతకు వచ్చే ఎంతోమంది ఆకలితో ఉన్నవారు ఉంటారని, వారందరికి కడుపునిండా భోజనం పెట్టడం అభినందించ విషయమన్నారు. సత్యసాయి సేవా సమితి సంఘం సభ్యులు ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. వారికి తనవంతు సహాయ సహకారాలు ఏం కావాలన్నా ఎళ్లవేళల ఉంటాయన్నారు. కాగజ్‌నగర్‌లో ప్రతిరోజు 2వేల మందికి భోజనం పెడుతున్నట్టు, వివిధ గ్రామాల నుండి కాగజ్‌నగర్‌కు వచ్చేవారు ఆకలితో అలమటించి పోకుండా ఆకలి తీర్చుకునేందుకు కోనేరు నిత్యన్నదానం సత్రంలో భోజనం చేసి వెళ్లాలని సూచించారు. ఈ నెల 22న మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన కారం సాయిరాంరెడ్డి రంజిత్ శ్రీనుతో కలిసి హిమాలయాల్లోని కేదార ప్రాంత పర్వతంపై ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటం ప్రదర్శించినందున సాయిరాంను మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో అభినందించి శాలువాతో సన్మానించారు. అనంతరం సాయిరాంరెడ్డి కేదార్ పర్వతంపై ఎమ్మెల్యే చిత్రపటంతో దిగిన ఫోటోను ఎమ్మెల్యే కోనప్పకు బహూకరించారు. కోనేరు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, విద్య, వైద్యం, ఉచిత కోచింగ్, రోడ్లు, వంతెనలు, సేవా కార్యక్రమాలపై మోటార్ సైకిల్ భారత యాత్ర నిర్వహిస్తానని, ఎమ్మెల్యే ఇంతటి సేవలు చేయడం అది ప్రపంచానికి తెలిసేలా చేస్తానని సాయిరాంరెడ్డి అన్నారు. ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ అబ్దుల్‌నస్రుల్లాఖాన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పెల్లి బ్రహ్మయ్య, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ దరఖాస్తులకు గడువు పెంపు

కాగజ్‌నగర్ : 2023-24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు తేదీని పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి నిర్ణయించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బి చక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నిర్ణయించిన ప్రకారం ఈ నెల 31తో గడువు తేదీ ముగియనుండగా, దీనిని ఫిబ్రవరి ఎనిమిదో తేదీ వరకు పొడిగించినట్లు ఆయన వివరించారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నటరాజ్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీలను పరిశీలించిన ఆయన శాఖల వారీగా కేటాయించారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండల కేంద్రంలో గత 35ఏండ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్‌కు పక్కా భవన స్థలం కేటాయించాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ హరీష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఎస్సీ హాస్టల్‌లో సరైన గదులు, టాయిలెట్స్ లేక అసౌకర్యాలతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌లు రెగ్యులర్ వార్డెన్‌తో పాటు ప్రత్యేక ట్యూటర్స్‌ను నియమించాలన్నారు. ఇంటర్ వరకు అప్ గ్రేడ్ చేయాలని కోరారు. ఈ విషయమై అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఎస్సీ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని హామీలు ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏబీవీపీ నాయకులు కార్తీక్, రాపెల్లివార్ కృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఆశాల సమస్యలపై ప్రస్తావించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫిబ్రవరి 3 నుండి ప్రారంభమై అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నిర్ణిత వేతనం, ఇతర సమస్యలపైన జిల్లా ఎమ్మెల్యేలు మాట్లాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. ఈ విషయమై ఆశ వర్కర్లతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆశాలకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు సునీత, ఆశ కార్యకర్తలు పుష్ప, స్వప్న, సురేఖ, ఆశ, ప్రేమలత, శ్రావణి ఉన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ శిబిరం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పార్డి(బి) గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తూము పుష్పలత రాజేశ్వర్‌లు హాజరై మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పశువులు, గేదెలను తీసుకువచ్చి ఉచిత క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు తమ తమ ఇంటి వద్ద ఉన్న పశువులు, గేదెలు పాల ఉత్పత్తి అధికంగా పెరగడానికి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ఉంటుందని అన్నారు. దీంతో పాటు గ్రామంలో ఉచితంగా కుత్రిమ గర్భాకోశం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అదే విధంగా పశువులకు గేదెలు ఎలాంటి వ్యాధులు వచ్చిన శిబిరానికి తీసుకువచ్చి పరీక్షించుకునేల చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ విశ్వజిత్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, రైతు సమన్వయ కమిటి అధ్యక్షుడు శేరి సురేష్, నాయకులు బాబు, గణేష్, నారాయణ, లక్ష్మణ్, స్వామి, రాజలింగు, శేఖర్ గ్రామస్తులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామన్న ఇంటిని ముట్టడిస్తాం : కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పని చేస్తున్న 300 ఓసీఎస్ నర్సుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగు రామన్న ఇంటిని ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ఎదుట గత మూడు రోజులుగా స్టాఫ్ నర్సులు చేపడుతున్న నిరసనకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా శిబిరానికి వెళ్లి మద్దతు పలికారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కంటిన్యూయేషన్ లెటర్ వెంటనే ఇవ్వాలన్నారు. వారం రోజులలోగా సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, నాయకులు మోతిరాం, చరణ్ గౌడ్, రాజు యాదవ్, శివాజీ, రాహుల్ చంద్రాల, ఫెరోజ్ ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని పలు మోడల్ స్కూల్‌లలో మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బంగారుగూడ, ఆదిలాబాద్, బజార్‌హత్నూర్, బోథ్, గుడిహత్నూర్, జైనథ్, నార్నూర్‌లలో 6వ తరగతి, 7 నుండి 10వ తరగతి వరకు సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు తెలంగాణఎంఎస్.సీజీజీ.గావ్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేళాపాళలేని కరెంటు కోతలతో రైతుల రాస్తారోకో

నవతెలంగాణ-ముధోల్

వేళాపాళలేని కరెంటు కోతలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముధోల్‌లో సోమవారం రాస్తారోకో చేపట్టారు. స్థానిక నాయబాది చౌరస్తాలో రాస్తారోకోకు దిగి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళిమోహన్ మాట్లాడుతూ 24 గంటలు కరెంట్ కోత లేకుండా ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెప్పడమే కానీ ఆచరణలో లేదన్నారు. రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులను అడిగితే పై అధికారులు చెప్పింది మేము వింటున్నామని చెబుతున్నరని పేర్కొన్నారు. కరెంటు కోతలతో రైతుల పంటలు ఎండిపోయి, నష్టపోతున్నారని అన్నారు. అధికారులు స్పందించడం లేదని, సమయపాలన పాటించడం లేదని, ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెబుతుంది, కానీ 24 గంటలు కరెంట్ కాదు కదా కనీసం 12 గంటల కరెంట్ కూడా ఇవ్వట్లేదని ఆరోపించారు. వెంటనే సమయపాలన పాటిస్తూ కరెంటు రైతులకు సరిపోయే విధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 20నిమిషాల పాటు రాస్తారోకో చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు మేస్త్రి నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నగరం మహిరాజు, రైతులు కర్రోళ్ల కృష్ణారెడ్డి, ధనగిరి పెద్ద చిన్నన్న, ఆజారే ముత్తన్న, ఒరగంటి పోశన్న, మంగారపు బోజన్న, ముతన్న, చాకలి సాయిలు, పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు



నవతెలంగాణ-నార్నూర్

ప్రజల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని వారికి అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు అధ్యక్షతన ప్రారంభించిన సర్వసభ్య సమావేశానికి అసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖలకు సంబంధించిన మండల అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలనీ సూచించారు. అధికారులు ఫీల్డ్ విజిట్ చేసినప్పుడే సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పూర్తి ప్రగతి నివేదికలతో సభకు హాజరు కావాలన్నారు. అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గంగుబాయి, వైస్ ఎంపీపీ యోగేష్, ఎంపీడీఓ సాయి ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు బాబు, సర్పంచ్ జైవంత్‌రావు, ఎంపీటీసీలు రాథోడ్ కిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, పీఆర్‌జేఈ లింగన్న, రాథోడ్ సునీల్, ఏఓ దివ్య, ఏపీఓ నితిన్, ఎంఈఓ ఆశన్నతో పాటు వివిధశాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు పాల్గొన్నారు.

ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, ఉట్నూర్

పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు యువకులు పోటీ పరీక్షల సంబంధించిన ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకోవాలని ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ జనార్ధన్ దండు, ప్రభాకర్ చౌటి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో యూపీఎస్సీ సివిల్స్, గ్రూప్-1, 2, 3 పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు పలువురు కళాశాల విద్యార్థులు హజరై ప్రసంగాన్ని విన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకొని రివిజన్ చేస్తూ చదవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిలిమినరీ మెయిన్స్‌లో వచ్చే ప్రశ్నలకు ఎన్సీఆర్టీ బుక్స్, రెగ్యులర్‌గా దినపత్రికలు చదువుతూ రెగ్యులర్‌గా మన ప్రభుత్వ పథకాలు కరెంట్ అఫైర్స్‌పై దృష్టి సారించాలని తెలిపారు. మనం ఒకసారి చదవగానే రాకపోవచ్చు, పదే పదే రివిజన్ చేయడం ద్వారా గుర్తుంటుందని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతిరోజు జరిగే కొత్త విషయాలను తెలుసుకోవాలని అన్నారు. ఇవే కాకుండా పలువురి మేధావుల గురించి ఉదాహరణగా తీసుకొని విద్యార్థులకు వివరించారు. ఏకాగ్రతతో భయపడకుండా, ప్రణాళిక బద్ధంగా చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ పరిపాలన అధికారి కోట సతీష్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, జిల్లా కార్యదర్శి బైరి సోమేశ్, నాయకులు ఉయిక విష్ణు, కుంరం దీపక్, కొట్నాక్ సక్కు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో..

ఏదైన ప్రభుత్వ పోటీ పరీక్షల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు చదువుతో పాటు రివిజన్ చాలా ముఖ్యమని ఫ్యాకల్టీలు అన్నారు. సోమవారం స్థానిక కేబీ కాంప్లెక్స్‌లో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సివిల్స్, గ్రూప్ 1,2,3,4పై నిరుద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీకి చెందిన ఫ్యాకల్టీలు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అకాడమీ కోర్సు డైరెక్టర్ దండు జనార్ధన్ మాట్లాడుతూ యూపీఎస్సీ, గ్రూప్ ఎగ్జామ్స్‌కు పోటీ పడుతున్న అభ్యర్థులు క్రమశిక్షణతో ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకుంటూ, చదివిన ప్రతి అంశం రివిజన్ చేసుకుంటూ వెళ్లాలని అన్నారు. ప్రిలిమినరి, మెయిన్స్‌లో వచ్చే ప్రశ్నలకు ఎన్సీఆర్టీ బుక్స్, రెగ్యులర్ దినపత్రికలు చదువుతూ రెగ్యులర్‌గా ప్రభుత్వ పథకాలు, కరెంట్ అఫైర్స్‌పై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ చౌటి ప్రభాకర్, పరిపాలన అధికారి కోట సతీష్, టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మెస్రం రాజు, రాష్ట్ర నాయకులు తనుష్, జిల్లా అధ్యక్షులు తుంరం ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.



మూడోరోజూ స్టాఫ్‌నర్స్‌ల నిరసన

● పట్టణంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్స్‌ల 8 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కంటిన్యూయేషన్ లెటర్లను ఇవ్వాలని ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్లతో రిమ్స్ ఎదుట తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రిమ్స్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రిమ్స్‌లో 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు 42 మంది ప్రభుత్వ కాంట్రాక్టులో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, కరోనా కష్టకాలంలోనూ ఫ్రంట్ లైన్ వారియర్లుగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వీరితో వెట్టి చాకిరీ చేయించుకుంటుందే తప్ప సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. 11వ పీఆర్సీ విషయంలోనూ సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వీరికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తక్కువ వేతనాలను చెల్లిస్తూ వాటిని కూడా ప్రతినెలా సక్రమంగా చెల్లించకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. జిల్లా అధికారులు డీఎంఈ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా 300 ఓసీఎస్ కింద పని చేస్తున్న స్టాఫ్ నర్సుల అందరినీ రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సహాయ కార్యదర్శి పెర్క దేవిదాస్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, నాయకులు సుమన్ తాయి, సుభాష్, స్టాఫ్ నర్స్‌లు రాజ్యలక్ష్మి కమల, మీనాక్షి, సురేఖ, శ్రీలత, కృష్ణకుమారి, అరుణ, పెర్సి, విశాల పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

నవతెలంగాణ-కడెం, లక్ష్మణచాంద

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని సీఐ అజయ్‌బాబు అన్నారు. మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో సోమవారం తెల్లవారు జామున కార్డెన్ సెర్చ్ చేపట్టారు. పోలీసులు గ్రామంలో ముమ్మరంగా నిర్బంధ తనిఖీలు చేసి, సరైన వాహన పత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలు, ఆటోలు, 3 కార్లు స్వాధీనం చేసుకున్నారు. అధిక ఫైన్లు ఉన్న ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రజల రక్షణ చర్యలలో భాగంగానే పోలీసులు వాహనాల తనిఖీలు చేపడతారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అలాగే వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్, తప్పక ఉండాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీల్లో ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని కడెం ఎస్సై కోసన రాజు, ఖానాపూర్ ఎస్సై శంకర్, దస్తురాబాద్ ఎస్సై ప్రభాకర్ రెడ్డి, పెంబి ఎస్సై రజినీకాంత్, ఎస్సైలు సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో...

నేరాల అదుపు కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని నిర్మల్ జిల్లా డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని బోరిగాం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 60 ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సీసీటీవీ ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు వివరించారు. వీలైనంత



త్వరగా గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండి భవిష్యత్తు మీద దృష్టి కేంద్రికరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నెంబర్ కావాలని అడిగితే స్పందించవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంఘ విద్రోహ శక్తుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సోన్ సీఐ రాంనర్సింహా రెడ్డి, లక్ష్మణచాంద ఎస్సై రాహుల్ గైక్వాడ్, సోన్, మామడ ఎస్సైలు రవీందర్, అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులను స్మరిస్తూ.. పోలీసుల మౌనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు క్రమశిక్షణతో రెండు నిమిషాల పాటు జిల్లా కార్యాలయం అధికారులు మౌనం పాటించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి సూచన మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, ఉదయం 11 గంటలకు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ క్రమంలో పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కలిసికట్టుగా అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల సేవలను వివరించారు. ప్రతి ఏటా జనవరి 30న భారతదేశమంతా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పిస్తూ ఉంటారని కొనియాడారు. అమర వీరులను స్మరించుకోవడం దేశపౌరుల బాధ్యతగా భావించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయం ఏఓ మహమ్మద్ యూనుస్ అలీ, పర్యవేక్షకులు ఎంఏ జోసెఫిన్, గంగాధర్, ఎంటీఓ ఎం.శ్రీపాల్, ఫింగర్ ప్రింట్ నిపుణులు శ్రీనివాస్, సెక్షన్ అధికారులు, టి.మురళి మోహన్, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గిన్నెల సత్యనారాయణ, ఐటీ కోర్ ఎంఏ రియాజ్, డీసీఆర్బి సీఐ గుణవంతరావు, ఎస్ఐ ఎంఏ హకీం, హెడ్ కానిస్టేబుల్ అతావుల్లా ఖాన్, పి సంజీవ్, మహిళా ఏఎస్సైలు జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం

నవతెలంగాణ-తాంసి

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాంసి, భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు విజయ సారథి, శ్రావ్య అన్నారు. సోమవారం మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలను అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిని మొదటి దశలో గుర్తించి, చికిత్స చేసుకుంటే, ప్రాణాతంకమైన వ్యాధి కాదని అన్నారు. శరీరంపై మచ్చలు ఉంటే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలని అన్నారు. మచ్చలపై స్పర్శ లేకపోవడంతో వెంట్రుకలు రాలడం లాంటి లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధిగా గుర్తిస్తారని అన్నారు. పీహెచ్‌సీలో ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందని అన్నారు. మొదటి దశలో వ్యాధిని గుర్తించనట్లైతే పూర్తిగా అంగ వైకల్యంగా మారుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, లింబాజి, వైద్య సిబ్బంది గంగాధర్, తులసిరామ్, ప్రవీణ, లక్ష్మి, వివేక్, విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేడ్మ బొజ్జు అన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగ నివాళులర్పించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఐక్యంగా ఉంచడానికి మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అధ్వర్యంలో భారత్ జోడో యాత్ర చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మతాల, కులాల మధ్య చిచ్చు పెడుతూ భారత దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించిందని అన్నారు. బీజేపీ ప్రజలలో సృష్టించిన వాతావరణాన్ని సోదర భావాన్ని నెలకొల్పడానికి భారత జోడో యాత్ర ప్రారంభించడం జరిగిందన్నారు. రిజర్వేషన్ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కుమ్మక్కై మోసం చేశాయని అన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామనే విషయం హామీకే పరిమితం అయిందని, ప్రత్యేక నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8 ఏండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చే విషయంలో మోసం చేశారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రజలే ఈ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

భారత్ జోడో యాత్ర దిగ్విజయంగా పూర్తి

నవతెలంగాణ-తాంసి

రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన పాదయాత్ర ఎంతో దిగ్విజయంగా పూర్తి కావడం శుభ పరిణామమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ నారాయణ అన్నారు. సోమవారం తాంసి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ప్రజలను విస్మరించి, నిరంకుశ పాలన కొనసాగిస్తోందని అన్నారు. ప్రజల సాదక బాధకాలను తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని అన్నారు. యువకులు, నిరుద్యోగులు, విద్యావేత్తలు, ప్రజలు చురుకుగా పాదయాత్రలో పాల్గొన్నారని అన్నారు. సోమవారం కాశ్మీర్‌లో ముగింపు కార్యక్రమం సందర్భంగా రాహుల్ గాంధీ జెండాను ఏగురవేయడం జరిగిందని అన్నారు. వారికి మద్దతుగా ప్రతి గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగుర వేయడం జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగారెడ్డి, రామన్న యాదవ్, హన్మాండ్లు, రామరెడ్డి, రజబలి, కిష్టన్న ఉన్నారు.

నార్నూర్ : రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో జాతీయ జెండాను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ యూసుఫ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసంపూర్తిగా, అసంతృప్తి హామీలిచ్చి తెలంగాణ ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. కరెంట్ చార్జీలతో బస్సు చార్జీలు, ధరణి రిజిస్ట్రేషన్ పేరుతో, దొంగ హామీలు దళితులకు, గిరిజనులకు, మూడు ఎకరాలు భూమి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రభుత్వ హామీలు ఎటు పోయిందని విమర్శించారు. పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వాలు చేసిన హామీల మేనిఫెస్టో చార్జి సీటు విడుదల చేశారు. రానున్న రోజులో దేశంలో రాష్ట్రంలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అబేదా ఖానమ్, నాయకులు కైలాష్, కరీమ్ ఖాన్, మాణిక్ రావ్, షేక్ సత్తార్, రాథోడ్ యశ్వంత్ రావ్, విష్ణు, రాహుల్, సాకీబ్ ఖాన్, రమేష్, కార్తీక్ రాథోడ్, షేక్ నసీర్, షేక్ మైను, నారాయణ్, ఎస్‌డీ నిజామ్, షేక్ సలీమ్, ధనలాల్, దుర్గు పటేల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యావసర సమయంలో రక్తదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన ఓ మహిళ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నదని ఆమెకు ఏ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. కుటుంబీకులు స్మైల్ సొసైటీని సంప్రదించగా, వెంటనే సొసైటీ ప్రతినిధి సాయిగౌడ ఏ పాజిటివ్ రక్తదానం చేసి మానవత దృక్పథాన్ని చాటుకున్నారు. కుటుంబీకులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, జెడ్పీటీసీ బ్రహ్మానందం, దత్తు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-తలమడుగు

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మండల కన్వీనర్ రాజేశ్వర్, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 134 రోజులు, 4,084 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తిచేసుకున్న సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అశోక్, మైనారిటీ సెల్ అధ్యక్షులు రఫీక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్, పార్టీ నాయకులు ప్రకాష్ రావు, పోతన్న, విలాస్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లింగన్న, నారాయణ, ధర్మో స్వామి, లింగన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు వరం కళ్యాణ లక్ష్మి పథకం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం మహిళలకు ఒక వరమని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. గాదిగూడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అదికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

నవతెలంగాణ-ఖానాపూర్

ఎమ్మెల్యే రేఖాశ్యామ్ నాయక్‌ను సోమవారం ఉట్నూర్ నూతన డీఎస్పీ నాగేందర్ ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉట్నూరు డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి నాగేందర్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజేందర్, రాము నాయక్, ప్రదీప్, పుప్పాల శంకర్, మణికంఠ ఉన్నారు.

నవతెలంగాణ
www.navatelangana.com
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 31 జనవరి 2023

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

తాండూర్ : కాంగ్రెస్ మండల మండల అధ్యక్షులు సూరం దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో మహాత్మా గాంధీ 75వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాపర్తి సుభాష్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ మొమిన్ అలీ, టీసీ సెల్ నాయకులు వడ్నాల మల్లేష్, సీనియర్ నాయకులు అర్షద్ ఖాన్, తోట శ్రీనివాస్, షేక్ అహ్మద్, జైన సాంబయ్య, మీర్ మోసిన్ అలీ, శంకరయ్య, కాసిం అలీ, కృష్ణ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మ గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి సర్పంచ్ వేముల కృష్ణ పూలమాల వేసి ఘనంగా నివాళ్లు లర్పించారు. పల్లెలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి చెందుతుంది అనే గాంధీ సూక్తిని అందరూ ఆచరించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే.నాగరాజు, వార్డు సభ్యులు పంబాల తిరుపతి, కంచర్ల పద్మ, బొల్లెపల్లి కొమురక్క, బన్న హిందుమతి పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత అన్ని రంగాల్లో ముందు ఉండేలా వారిని ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేయాలని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాలయి అభిప్రాయపడ్డారు. సోమవారం తన కార్యాలయంలో డీవైఎఫ్ఐ 2023 క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమురంభీం జిల్లాలో ఉన్న యువత అన్ని రంగాల్లో ముందుండాలని ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొని విజయాలు సాధించాలని అన్నారు. డీవైఎఫ్ఐ యువతని ప్రోత్సహించడంలో ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి సుభాష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, జిల్లా సహాయ కార్యదర్శి గేడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, జిల్లా కమిటీ సభ్యులు పురుషోత్తం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశాల ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, అర్హత కలిగిన ఆశ వర్కర్లకు రెండవ ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని, అదనపు పనికి అదనపు వేతనాలు ఇవ్వాలని కోరారు. కంటి వెలుగు, లెప్రసి సర్వేలకు అదనపు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్, ఆశ వర్కర్‌లు నవీన, పద్మ భారతి, సేవంత, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కేవీ కేశవులు ఆశయ సాధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మాజీ మంత్రి, స్వతంత్ర సమరయోధుడు కేవీ కేశవులు ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీ కులాల ఐక్య పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేపి నరసింహులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో కేశవులు ఐదవ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కేశవులు చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యేగా అతను పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేని అన్నారు. స్వతంత్ర పోరాటంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తి అని కొనియాడారు. సిర్పూర్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా జలగం వెంగళరావు మంత్రివర్గంలో మంత్రిగా పేద ప్రజలకు సేవలు అందించిన మహా నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఆడెపు లక్ష్మీనారాయణ, కడారుల నరసయ్య, కోడూరి చంద్రయ్య, మామిడి విజయ్, రాజుల దేవి వెంకటేష్, మాడిశెట్టి సంతోష్, శ్రీపాదం రమేష్, నల్లపు కృష్ణ, పవన్, కొండపల్లి మహేష్, శ్రీధర్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆర్కే-6 గని ఉద్యోగులను, అధికారులను అభినందించిన జీఎం



నవతెలంగాణ నస్పూర్

2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని 63 రోజుల ముందుగానే సాధించినందుకు సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి గని ఉద్యోగులను, అధికారులను అభినందించారు. సోమవారం గని ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్కే-6 గని ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకుల సమిష్టి కృషితోనే గడువులోగా లక్ష్యం సాధ్యమైందన్నారు. కంపెనీ మొత్తంలో మొదటి స్థానంలో ఉందని, రక్షణపై దృష్టి సారించాలని కోరారు. గని రికార్డుల పర్వం ఇలాగే కొనసాగాలని, గని ఉద్యోగులు ఉత్పత్తిలోనే కాకుండా సంఘ సేవలో ముందుండాలని నిరూపించి తల సేమియాతో బాధపడుతున్న గౌసియాకు రూ.50,000 అందజేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం జనవరి 31న పదవి విరమణ పొందుతున్న ఏరియా రక్షణాధికారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏజెంట్ ఏవి రెడ్డి, ఏరియా రక్షణాధికారి గోసిక మల్లేష్, టీబీజీకే ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి శ్రీనివాస్, అధికారి రాంనర్సయ్య పాల్గొన్నారు.

లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ

నవతెలంగాణ-జన్నారం



మండల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్యాల బాపన్న మాట్లాడుతూ ఇండ్లలో ఉన్న చెడిపోయిన కంప్యూటర్లు, ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరిస్తున్నామన్నారు. వాటిని రీసైకిలింగ్ చేయించి, వాతావరణంలో కలుషితం కాకుండా చేయాలన్నదే తమ అభిమతం అన్నారు. లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. చెడిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంచుకోకుండా ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, తామర ప్రేమ్ సాగర్, రమేష్, మణికుమార్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ఇవ్వాలని రైతుల ధర్నా

- పోలీసుల అరెస్టుతో అనుమతి కోసం వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పత్తికి కనీసం మద్దతు ధర రూ.12000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల రైతులు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకొని మద్దతు ధర ఇవ్వాలని సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాసేపు నిరసన తెలిపిన తర్వాత పోలీసులు రంగ ప్రవేశం చేసి జిల్లాలో 30 ఆక్ట్ అమల్లో ఉందని అనుమతి లేకుండా ధర్నా చేస్తున్నందుకు వారిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ రాణా ప్రతాప్‌తో మాట్లాడిన తర్వాత ఫిబ్రవరి మూడో తేదీన నిరసన తెలపడానికి అనుమతి ఇవ్వాలంటూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి విషయం వారికి వివరించి చెబుతానని తెలుపడంతో రైతులు తిరిగి వెళ్ళిపోయారు. కార్యక్రమంలో ప్రభాకర్, కృష్ణ, శరత్, రమేష్, తిరుపతి, కార్తీక్, వెంకటేష్ పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

- మధ్యలోనే బయటకొచ్చిన కొందరు కౌన్సిలర్లు
- 24 అంశాలను ఆమోదించిన మెజార్టీ సభ్యులు



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశం ఒక్క సారిగా వేడెక్కింది. మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు పలువురు కౌన్సిలర్‌లు సమావేశాన్ని బైకాట్ చేశారు. సమావేశం మధ్యలోంచి బయటకి వచ్చిన పలువురు కౌన్సిలర్లు కమిషనర్, చైర్మన్‌లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. వారు వ్యవహరిస్తున్న తీరుకు నిరసన వ్యక్తం చేశారు. సమావేశాన్ని భహిష్కరించిన వారిలో అధికా పక్షం కౌన్సిలర్లు సైతం ఉండటంతో చర్చనీయ అంశంగా మారింది. మున్సిపల్ చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రజా ప్రయోజనాలను గాలికొదిలి స్వప్రయోజనాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ వెంచర్లు, నిర్మాణాలకు అనుమతులిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతి నిధుల కోసం వేచి చూడటం తప్ప, అభివృద్ధికి నిధులు సమకూర్చడంలో దృష్టి పెట్టడం లేదన్నారు. పాలకవర్గం ఏర్పడి మూడేండ్లు గడిచినా వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందటంలేదని, రోడ్లు, మురికి కాలువలు అధ్వానంగా మారాయని వివరించారు. ఈ సమావేశంలోని 24 అంశాలను మెజారిటీ సభ్యులు ఆమోదించారు.

దళితునినని చిన్న చూపు చూస్తున్నారు

బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు సమావేశాన్ని బైకాట్ చేయటం పట్ల మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌ను వివరణ కోరగా దళితుడినని నాపై ఆరోపణలు చేస్తున్నారని, వారు చేసే ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. సొంత పార్టీ నాయకులు కూడా విమర్శించడంపై పార్టీ జిల్లా నాయకులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కనుచూపుమేరలో ఉన్న మున్సిపాలిటీలో సొంత పార్టీ కౌన్సిలర్లే ఆరోపణలు చేసుకోవడంపై పార్టీ నాయకత్వం సరిగా లేదని, అనుభవం ఉన్న ఎమ్మెల్యే ఉన్నప్పటికీ పార్టీలో లుకలుకలు కొనసాగుతున్నాయని పెదవి విరుస్తున్నారు.



హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-జన్నారం

బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చటంలో విఫలమైదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి,కేసిఆర్ దగా తీరుపై కాంగ్రెస్ చార్జి షీట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ టూ పీజీ ఉచిత విద్య, పోడు భూములకు పట్టాలు, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇవ్వకుండా కేసీఆర్ మోసం చేశాడన్నారు. ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి సేకరిస్తున్న భూములకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. దళిత గిరిజనుల కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తానని ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడంలో, ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. కరెంటు, బస్సు, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి ప్రజలను ప్రభుత్వం దోచుకుంటుందని విమర్శించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకోకుండా వారికి సహకారం అందించకుండా మోసం చేసిన ప్రభుత్వం ఇదే అన్నారు. ధరణి పేరుతో రైతులను దగా చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఖాళీ స్థలాలను కబ్జా చేయడంలో బకాసురుని మించిపోయారన్నారు. మోడీ అనాలోచిత నల్ల చట్టాల ద్వారా 700 మంది రైతులు మరణించారన్నారు. వారికి నష్టపరిహారం ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. బీజేపీ హయాంలో మహిళలపై అఘాయిత్యాలు 27 శాతం పెరిగాయని తెలాపారు. రాహుల్ గాంధీ 3500 కిలోమీటర్లు భారత్ జోడో యాత్ర పూర్తయిన సందర్భంగా మండలంలో కాంగ్రెస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా ముందుగా ఆయనకు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్, రేండ్లగూడ సీనియర్ నాయకులు కరుణాకర్, వార్డ్ మెంబర్ గంగన్న యాదవ్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఇమ్రాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్యా పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కోటపల్లి

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్‌లు సోమవారం విస్తృత తనిఖీలు చెప్పాట్టారు. చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రాణహిత నది సరిహద్దు గ్రామాలైన వెంచపల్లి, జనగామ, అలుగామ గ్రామాలను ఆకస్మికంగా సందర్శించి సరిహద్దు భద్రతపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ప్రాణహిత నదిలో చేపలు పట్టేవారు. నదిలో పడవలు నడిపేవారితో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సరిహద్దుల్లో సంచరిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. సంఘ విద్రోహ శక్తులకు ఎవ్వరు కూడా ఆశ్రమం కల్పించకూడదని, సరిహద్దు భద్రతకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్న పోలీస్‌లకు సమాచారం చేరవేయలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి కదలికలలో ఎలాంటి అనుమానం కలిగిన పోలీస్‌లకు తెలపాలని పడవలు నడిపే వారికి సీఐ, ఎస్సైలు సూచించారు. పడవల ద్వారా సరిహద్దులను తెలంగాణలోకి వస్తున్నవారిని ప్రతిఒక్కరిని పోలీస్‌లు తనిఖీ చేసి వారి వివరాలను సేకరించారు. అలాగే సరిహద్దు గ్రామాల్లోని యువత అప్రమత్తంగా ఉంటూ పోలీస్‌లతో కలసి ముందుకు సాగాలన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-తాండూర్

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని రేచీని మత్స్య సహకార సంఘం సభ్యులు కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సహకార సంఘ భవనం లేకపోవడంతో సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. అదేవిధంగా రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని రాముని చెరువు తూము మరమ్మతులు చేపట్టాలని వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిరణ్మయి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నందకుమార్ పాల్గొన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేయాలని ఫిర్యాదు

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి శివారులో గల అక్రమ పట్టాలను రద్దు చేయాలని సోమవారం తహసీల్దార్ రాజ్ కుమార్‌కు నీల్వాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దుర్గం సక్కుబాయి ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా గాలి మధుకు సర్వే నెం. 302లో 2ఎకరాలు, కుడుకల రాజారాంకు 1ఎకరం 20 గుంటలు, మమడ శివారులో గాలి కిష్టయ్యకు సర్వే నెం. 127/1/1లో 4ఎకరాల 30 గుంటలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిదంగా ఈ అక్రమ పట్టాతో గాలి మల్లక్క పేరు మీద రైతు బీమా కూడా తీసుకున్నారని, అ డబ్బులు రికవరీ చేయాలని ఫిర్యాదు చేసారు.

డివైడర్లలోని కోనోకార్పోస్ చెట్లను తొలగించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో డీవైడర్ల మధ్య పెంచిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసేల కార్తీక్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో హడావిడిగా అనేక ప్రాంతాలలో మొక్కలు నాటిందని వీటిలో కొన్ని మానవజాతినికి హాని కలిగించేవి ఉన్నాయని, అందులో కోనోకార్పస్ మొక్క మానవజాతికి అతి ప్రమాదకరమైందని అన్నారు. అలాంటి మొక్కలను ప్రభుత్వము రాష్ట్ర వ్యాప్తంగా డివైడర్ల మధ్యన ఇతర ప్రాంతాలలో నాటారని ఇవి పెద్ద వృక్షాలుగా మారి మనుషుల ప్రాణానికి హాని కలిగించే విధంగా ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రంలో డివైడర్ల మధ్య ఈ మొక్కలు నాటారని వాటిని వెంటనే తొలగించి ఆక్సిజన్ అందించే చెట్లని నాటాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గేడం టికనంద్, జిల్లా కమిటీ సభ్యులు పురుషోత్తం, నిఖిల్ పాల్గొన్నారు.

పౌరులు సమానత్వం కలిగి ఉండాలి



నవతెలంగాణ-తాండూర్

పౌరులంతా సమానత్వంతో కలిసిమెలిసి జీవించాలని తాండూర్ తహసీల్దార్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కుల మత భాష వర్గ భేదాలను విడనాడి సోదర భావంతో మెలగాలన్నారు. ప్రభుత్వం అందించే హక్కులను బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జీవితాన్ని సాగించాలని తెలిపారు. సమానత్వం వల్ల ఐక్యత ఏర్పడి సమ సమజం పురోగతి చెందుతుందని తెలిపారు ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల పిల్లల కోసం ప్రభుత్వం అనేక విద్యా అవకాశాలను అందిస్తుందని తెలిపారు. వారికోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయడమే కాకుండా విద్య ఉన్నత విద్యను అందుపుచ్చుకునే విధంగా అనేక రాయితులను అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ద్వారకాపూర్ సర్పంచ్ మాసాడి శారద, ఎంపీఓ సత్యనారాయణ, సీఏ జనార్ధన్, అంగన్వాడీ టీచర్ అమృత పాల్గొన్నారు.

నేడు కళాశాలలో బయోమెట్రిక్‌పై ప్రత్యేక శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు అమలు ప్రారంభమైందని మంగళవారం మాధ్యమిక విద్య కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ తెలిపారు. బయోమెట్రిక్ మిషన్ల ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి అన్ని కళాశాలల్లో బయోమెట్రిక్ మిషన్లు ప్రారంభించబడినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో బయోమెట్రిక్ హాజరుకై ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించబడిందని. ప్రతీ ఉద్యోగి ఆధార్ బయోమెట్రిక్‌తో హాజరు నమోదు చేయబడుతుందని అన్నారు. విజన్ టెక్ కంపెనీ వారి ఆబాస్ (ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్) మిషన్లు అందజేయబడ్డాయని తెలిపారు. ప్రతి కళాశాలలో బయోమెట్రిక్ ఇన్‌ఛార్జి ఆధ్వర్యంలో మిషన్ నియమావళిని అమలు పరుస్తారని పేర్కొన్నారు. కళాశాలల్లో బయోమెట్రిక్ మిషన్లను వాడడం, రోజువారీ సెలవులు, ఆన్ డ్యూటీ తదితర నమోదుపై 31వ తేదీ మంగళవారం నాడు మధ్యాహ్నం 2 గం.లకు ఇంటర్ విద్య కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిర్ణయించిన సిబ్బంది శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి 2023 నూతన క్యాలెండర్‌ను సోమవారం జీఎం కార్యాలయంలో జీఎం బి.సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఉద్యోగులందరికీ నూతన సంవత్సర క్యాలెండర్లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎస్ఆర్‌పి3,3ఏ గనిలో మేనేజర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులకు క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు పి.గోవిందరాజు, పి.అరవిందరావు, చిరంజీవులు, ఎస్టేట్స్ ఆఫీసర్ వరలక్ష్మి, పర్చేస్ ఎస్ఈ చంద్రశేఖర్, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ పీఓ ఎ. కాంతారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు వచ్చేలా చూడాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఎక్కువ రాజి కేసులు వచ్చేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రవీంద్ర శర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో సోమవారం అడ్వకేట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రి-లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదా కేసులు, వివాహ, కుటుంబ తగాదాల కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించబడునని కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు భువనగిరి సతీష్ బాబు, సీనియర్ న్యాయవాదులు తాటి పల్లి సురేష్, డి.వెంకటేష్, జగన్ మోహన్ రావు, గవర్నమెంట్ ప్లీడర్ దీపక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్ రావు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
మంగళవారం 31 జనవరి 2023

అర్జీదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించడం జరుగుతోందని, అందుకు అధికారులు అర్జీదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా 10 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబు పాల్గొన్నారు.

నేడు స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ జిల్లా స్థాయి పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో స్పెల్ విజార్డ్ మరియు స్టోరీ టెల్లింగ్‌పై జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గం తులసీరాం, సయ్యద్ హదియా ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది, తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులకు గతేడాది డిసెంబర్ 29న స్కూల్ స్థాయిలో, జనవరి ఏడో తేదీన మండల స్థాయిలో ఈ పోటీలు నిర్వహించగా, ఇందులో గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. విద్యార్థుల గైడ్ టీచర్లు ఎంపికైన విద్యార్థులను ఈ పోటీలకు తీసుకురావాలని, ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఇంగ్లీషు ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం ఉంటుందని వారు తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో ఏఎన్ఎంలు, ఆశాల పాత్ర కీలకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైద్యారోగ్య శాఖలో ఏఎన్ఎంలు, ఆశాల పాత్ర కీలకమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ఆశా, ఎఎన్ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు ఏఎన్ఎంలు, ఆశాల సేవలను కొనియాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వైద్యాధికారులు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీయూ జిల్లా అధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) జిల్లా అధ్యక్షులుగా చింతలమానెపల్లి మండలం డబ్బా ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు అబ్దుల్ ఖమర్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం మణిపాల్, ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి లేఖ విడుదల చేశారు. జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, సంఘం బలోపేతానికి పాటు పడతానని ఈ సందర్భంగా అబ్దుల్ ఖమర్ పేర్కొన్నారు. తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి కేటాయించినందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామి రాక

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని శ్రీ అడెల్లి మహాపోచమ్మ దేవస్థానానికి మంగళవారం సాయంత్రం 4గంటలకు హంపీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీస్వామిజీ రానున్నట్టు ఆలయ చైర్మన్ అయిటి చందు తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణానికి సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. అడెల్లి గ్రామ ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కార్యదర్శి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని గురుడుపేట జూనియర్ పంచాయతీ కార్యదర్శి పెరుగు గణేష్(32) ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందగా సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపి రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందించారు. తోటి మిత్రుడు ఇలా రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడంతో కార్యదర్శులు సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రి వద్ద గల గణేష్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగా తమ వంతుగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి డ్రైవర్లకు, బిజెపి కార్యకర్తలకి ఇన్సూరెన్స్ చేయించడం అభినందనీయమని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుహాసినిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ ముఖ్యాతిథిగా హాజరయ్యారు. పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్ ద్వారా డ్రైవర్లకు ఇన్సూరెన్స్ బాండ్ పత్రాలను సుహాసినిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోస్టల్ ద్వారా కల్పిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై రైతులకు అవగహన



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని అంతర్ని గ్రామ పంచాయతీలో రిలియన్స్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రిలియన్స్ కంపెనీ సభ్యులు మానస మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు తమ తమ వ్యవసాయ క్షేత్రంలో క్రిమిసంహారక మందులను వాడకంపై అనేక రకాల వ్యాధులు రావడం జరుగుతుందని అన్నారు. దీంతో ఎలాంటి పంటలకైనా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని అన్నారు. పంటలపై పిచికారీ చేస్తే పంటలకు, ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. అదే విధంగా రిలియన్స్ ద్వారా రైతులు ఉచితంగా కూరగాయల విత్తనాలు వాటికి అవసరమైన మందులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. దీంతో ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత దేవిదాస్, రమేష్, రైతులు ఉన్నారు.

భారత్ జోడో యాత్ర విజయవంతం

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి అందరూ సోదరా భావంతో జీవించాలనే లక్ష్యంతో కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశ్ కా నేత రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర చేపట్టడం చాలా గర్వకారణమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర విజయవంతంగా పూర్తైన సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. సోమవారం డీసీసీ అధ్యక్షుని నివాసంలో జాతీయ పతాకావిష్కరణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ భారత్ జోడో ముఖ్య ఉద్దేశం నఫ్రత్ చోడో భారత్ జోడో అని అన్నారు. నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం సత్యం, శాంతి, అహింస అని, ఇవి బీజేపీ పరిపాలనలో కొరవడ్డాయని తెలిపారు. అందుకే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని స్పష్టం చేశారు. కాశ్మీర్ లాల్ చౌక్‌లో తిరంగా జెండాను ఆవిష్కరించడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని, ఇది ఓ చారిత్రక ఘట్టం అని ఈ చారిత్రక ఘట్టంలో నడిచినటువంటి రాహుల్ గాంధీ అడుగులో అడుగు వేస్తూ నడిచిన ప్రతి ఒక్క భారతీయ పౌరులందరికీ భారత్ చోడో యాత్ర ముగింపు సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతదేశంలో నాడు అద్వైత్వ గురువు శంకరాచార్యులు కన్యాకుమారి నుండి హిమాచలం వరకు పాదయాత్ర చేశారు. ఆ తరువాత రెండవ వ్యక్తి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడ సంతోష్, జిల్లా సేవాదళ్ చైర్మన్ మోతీరాం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చరణ్‌గౌడ్, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, ఎస్సీ సెల్ చైర్మన్ రాహుల్ చంద్రాల, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మున్నాభాయ్ పాల్గొన్నారు.

బేల : ఏఐసీసీ, పీసీసీ ఆదేశాలతో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ముగింపు సందర్భంగా సంఘీభావంగా సోమవారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర దేశంలో 4000 కిలోమీటర్లు సాగిందన్నారు. లక్షలాది మందిని కలిసి వారి సాదకబాధలు తెలుసుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచి మధ్యతరగతి కుటుంబాల జీవన విధానాన్ని పూర్తిగా దిగజార్చిందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ సైతం ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 6న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర ప్రారంభించనున్నారని, ప్రతి బూత్‌లో పాదయాత్ర నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, మాజీ జడ్పిటిసి రాందాస్ నాక్లే, బాపురావు హుల్కే, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్‌రావు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు ఘన్‌శ్యామ్ గావండే పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

- ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ పిఓకు దరఖాస్తులను అందజేశారు. ఉట్నూరు మండలం లింగోజితండాకు చెందిన జె.రవికిరణ్ తనకు డయాగ్నోస్టిక్ సెంటర్ మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ జిల్లా వట్టివాగు గ్రామానికి చెందిన కె.వినోద్‌కుమార్ తనకు వాహనం కొనుగోలుకు సబ్సిడీ రుణం మంజూరు చేయాలని, ఇంద్రవెల్లి మండలం అంజి గ్రామానికి చెందిన శశికళ భూమికి బోరు బావి విద్యుత్ మోటారు మంజూరు చేయాలని, ఉట్నూరు మండలం రాంజీగోండ్‌నగర్‌కు చెందిన సోయం సుభాష్ తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని, ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన ఆర్.నిరంజన్ (మెడికల్ రీయింబర్స్‌మెంట్) ఆర్థిక సాయం మంజూరు చేయాలని కోరారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, పోడు భూముల సర్వే, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అందజేశారు. అర్జీలను పరిశీలించిన పిఓ శాఖల వారీగా కేటాయించారు. సమస్యలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డా. దిలీప్ కుమార్, ఏపీఓ జనరల్ కనక భీంరావు, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొమురం బాలు, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఈఈ రాథోడ్ భీమ్‌రావ్, ఓఎస్డి క్రిష్ణయ్య, ఏవో రాంబాబు, జెడిఎమ్ నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, హెచ్ఓ సుధీర్, డీపీఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, జిల్లా నాయకులు కృష్ణమాచారి వెలిశాల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రాబోయే బడ్జెట్ సమావేశాలలో ఫిక్స్‌డ్ వేతనంతో పాటు బడ్జెట్ కేటాయింపులలో ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, వీరిని కార్మికులుగా గుర్తించాలని సమ్మె చేసిన సమయంలో సాక్షాత్తు సీఎం కేసీఆర్ వీరితో సమావేశమై రూ. ఆరు వేల కనీస వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు రూ 10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదనపు పనులకు అదనపు వేతనం చెల్లించాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి నగరం పద్మ వర్కర్‌లు రమాదేవి, వనిత, శోభారాణి, సుశీల, మీనా, సరస్వతి, ప్రమీల, సురేఖ, లక్ష్మి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై స్పందించని అధికారులు



నవతెలంగాణ-ఉట్నూర్

సమాచార హక్కు చట్టం ద్వారా సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గిరిజన నాయకుడు చౌహాన్ రాము అన్నారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బజార్‌హత్నూర్ మండలం మాన్యాపూర్ ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారికి మండల రెవెన్యూ అధికారుల అండతో అక్రమంగా అటవీ హక్కు పత్రం ఇచ్చారని తెలిపారు. గతంలో ఇదే భూమిలో తమ తల్లిదండ్రులు ఉండగా 1996లో అటవీ అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయించారని అన్నారు. తమకు చెందిన భూమిని రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండానే మహారాష్ట్ర వాసికి అటవీ హక్కుపత్రం అందించారని తెలిపారు. అదే విధంగా ఈ మండలంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన వారికి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తూ కళ్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ది చేకూరుస్తున్నారని తెలిపారు. వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ మండలంలోని రాజులమడుగు గ్రామానికి చెందిన గిరిజనుడు టేకం బక్కు తండ్రి బాపురావు మృతి చెందడంతో తండ్రి పేరిట ఉన్న భూమిని విరాసత్ చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా గిరిజనుల సమస్యలపై స్థానిక అధికారుల స్పందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో గిరిజనులు శ్రీరామ్, లక్ష్మణ్, భారత్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

అమర వీరులకు ఎల్లవేళలా రుణపడి ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్



దేశ స్వాతంత్ర్య కొరకు త్యాగాలు చేసిన అమర వీరులకు ఎల్లవేళలా రుణపడి ఉండాలని ఎస్పీ సిహెచ్.ప్రవీణ్ కుమార్ అన్నారు. అమర వీరుల సంస్మరణలో భాగంగా సోమవారం క్యాంపు కార్యాలయంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పౌరులు మాతృదేశ ఐక్యతకు, శాంతి ఉన్నతికి కట్టుబడి ఉండేందుకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం కల్పించడం లక్ష్యంగా వేలాది మంది స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకొని, తమ ప్రాణాలను సైతం అర్పించారన్నారు. వారి త్యాగ ఫలితంగానే నేడు మనమంతా ఆ ఫలాలను అనుభవిస్తున్నామని తెలిపారు. అలాంటి త్యాగధనులను స్మరించుకోవడం దేశ పౌరులుగా మనందరి బాధ్యతన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ దేశాభివృద్ధిలో పాలు పంచుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఓ వెంకట శేఖర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్ రమేష్, రామకృష్ణ, ఆర్ఎస్ఐ సాయికుమార్, సూపరింటెండెంట్లు, కార్యాలయ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కెనాల్ మరమ్మతుల పనులను పరిశీలించిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-కడెం



మండలంలోని మాసాయిపేట్ గ్రామ సమీపంలో గల సదర్మాట్ కడెం ఫీడింగ్ కెనాల్ మరమ్మత్తుల పనులను సోమవారం ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ఈ సుశీల్ కుమార్‌ను కడెం ప్రాజెక్ట్‌లోకి నీటి ఫీడింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీటి కష్టాలు లేకుండ చూడాలని సూచించారు. రైతుల సంక్షేమం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. సదర్మాట్ కెనాల్ పూర్తిస్థాయి ఆయకట్టు వరకు పర్మినెంట్ కొరకు సీసీ వేసేందుకు అసెంబ్లీలో మాట్లాడి పూర్తి స్థాయి సీసీ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. ఇరిగేషన్ అధికారులు రైతులకు సహకరించి నీటి విడుదలలో జాప్యం చేయకుండ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ శంకర్ పటేల్, స్థానిక సర్పంచ్ రాముగౌడ్ పలువురు నిర్మల్, మంచిర్యాల జిల్లాల నాయకులు ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి సమీపంలో పెద్దవాగు వద్ద నిర్వహించే మినీ మేడారం జాతర ఏర్పాట్లను సోమవారం రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ సోనియా పరిశీలించారు. జాతర అధ్యక్షులు తుమ్మ రమేష్, కార్యదర్శి పోలోజు శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు సీఐ, ఎస్ఐలకు వివరించారు. వీరి వెంట నాయకులు కోట శంకర్, వెంకటేష్, పిర్సింగుల శ్రీనివాస్ ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రేఖా నాయక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుప్పాల శంకర్, శనిగారపు శ్రవణ్, సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-కెరమెరి

క్రీడలతోనే మనసికోల్లాసం కల్గుతుందని ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. సోమవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో ఎంపిపి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. క్రీడలతో యువకుల్లో స్నేహాభావంతో పాటు శారీరక సౌష్టవం ఏర్పడుతుందని తెలిపారు. మండల పరిసర గ్రామాల ప్రజలు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ద్రుపతబాయి, వైస్ ఎంపిపి సయ్యద్ అబ్దుల్ కలాం, సాంగ్వి సర్పంచ్ తొడసం జగన్నాథ్‌రావ్, ఎస్సై వెంకటేష్, కుంరం భీంరావు, ఝరి సర్పంచ్ కుంరం నాగేశ్వర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-భీమారం

మండలానికి చెందిన పలువురికి సీఎం సహాయక నిధి నుంచి మంజూరైన చెక్కులను మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పింగిలి మంజులకు మంజూరైన రూ.36వేల, ఖాజీపల్లి గ్రామానికి చెందిన దుర్గం మల్లుకు మంజూరైన రూ.20వేల చెక్కులను పార్టీ మండల కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఖాజీపల్లి సర్పంచ్ దాడి తిరుపతి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని చౌప్పన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల చిన్నపుల్లారా గ్రామానికి చెందిన కుమురం మారుతిపై సోమవారం అడవిపంది దాడి చేసింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం తన చేనులో పనులు నిర్వహించడానికి వెళ్లగా ఒక్కసారిగా అడవిపంది మారుతిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. మారుతిని అటవీ శాఖ అధికారులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేను పనులకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అడవి పంది ఎదురుపడితే ఎలా తప్పించుకోవాలనే దానిపై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్

సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని, వారితో స్నేహబావంగా ఉండాలని జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపట్ల కఠినంగా, చట్టరీత్యా చర్యలుంటాయని అన్నారు. పోలీసుల సహాయం కావాలనుకున్నా వారు పోలీసు స్టేషన్‌లో నిర్భయంగా ధరఖాస్తు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనుమాస్పదన వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని దృష్టికి వచ్చిన, వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేయాలని అన్నారు. జిల్లా వాట్సప్ నెంబరు 8712659599కు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

ఆర్జీయూకేటీలో సైన్స్ అప్లికేషన్‌పై జాతీయ సెమినార్

నవతెలంగాణ-బాసర



ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో సోమవారం సైన్స్ అప్లికేషన్ అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతి ఆధారంగా సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగించే అప్లికేషన్ జ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అప్లికేషన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అసోసియేట్ డీన్ పావని మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంలో నానో సైన్స్ పాత్ర అమోఘమైనదని అన్నారు. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చగల సామర్థ్యం నానో సైన్సుకు ఉందని అన్నారు. అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నానో టెక్నాలజీ కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ శోభ, శ్రీనివాస్, విఠల్, శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

అదిలాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 1న నిర్వహిస్తామని మండల అధ్యక్షులు గండ్రత్ రమేష్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు. ఎంపీటీసీలు, శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు. ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సభ్యులు సమయానికి హాజరు కావాలని కోరారు.

వంతెన పనులు పూర్తి చేయాలి

- సేవాలాల్ సేన అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్
- సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రాస్తా రోకో

నవతెలంగాణ-కెరమెరి

అనార్ పల్లి, లక్మాపూర్ వంతెన పనులు వెంటనే పూర్తి చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్ లాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం అనార్ పల్లి పరిసర గ్రామాల ప్రజలు అనార్ పల్లి నుండి మండల కేంద్రం వరకు ర్యాలీగా వచ్చి బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాథోడ్ రూప్ లాల్ నాయక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనార్ పల్లి, లక్మా పూర్ పెద్ద వాగుపై వంతెన లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల క్రితం వంతెన పనులు ప్రారంభమైన నేటికీ పూర్తి కాకా పోవడంతో ప్రజలు రాకపోకలకు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనార్పల్లి వంతెన పనులు నేటికి పిల్లర్ల దశలో లోనే పనులు



కొనసాగుతున్నాయని అన్నారు. ఐదేళ్ళ క్రితం వంతెన పనులు ప్రారంభమైన పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే వంతెన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రాస్తా రోకో సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులను సముదాయించి రాస్తా రోకో విరమింప జేశారు. కార్యక్రమంలో అనార్పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావ్, కరంజివాడ సర్పంచ్ గోవింద్ రావ్, రమేష్, బాణోత్ వెంకట్ నాయక్ పాల్గొన్నారు.

అనారోగ్య కారణాలతో బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

అనారోగ్య కారణాలతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుణక్కనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బ లక్ష్మీ వంశిక(12) ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. తండ్రి అనారోగ్యంతో మరణించడంతో తల్లి సుజాత మంథని కోర్టులో ప్రాసెసింగ్ సర్వర్‌గా పనిచేస్తుంది. తల్లి పని నిమిత్తం వెళ్ళగా, అమ్మమ్మ బయటికి వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. సంఘటన స్థలానికి శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై మానస చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నమన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేక విమర్శలు

నవతెలంగాణ-మంచిర్యాల



నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు లభిస్తున్న ప్రజాదారణ చూసి ఓర్వలేకనే అధికార పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, తమ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం రహదారులు, భవనాలు శాఖ అతిథి గృహంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రేమ్ సాగర్ రావుపై అసత్య ఆరోపణలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే వైఫల్యం చెందడంతో ప్రతిపక్ష పాత్ర వహిస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందని వారన్నారు. ఎమ్మెల్యే దివాకర్ రావు అనాలోచిత నిర్ణయాల వల్ల మంచిర్యాల నియోజకవర్గం తిరోగమన దశలో పయనిస్తుందని మండిపడ్డారు. ప్రేమ్ సాగర్ రావు చేస్తున్న పోరాటాన్ని సహించలేక గూండా, రౌడీ అంటూ తప్పుడు కూతలు కూస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రేమ్ సాగర్ రావు తప్పుడు పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని అంతేకానీ తప్పుడు ఆరోపణలు దిగడం సబబు కాదని వారు హితవు పలికారు. రాబోయే ఎన్నికల్లో దివాకర్ రావును ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి ప్రేమ్ సాగర్ రావును అసెంబ్లీకి పంపించడం తథ్యమని వారు జోస్యం చెప్పారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య కేవలం ఎమ్మెల్యే ఆయన కొడుకుకు భజన చేయడానికి మాత్రమే ఉన్నాడని విమర్శించారు. సమస్యలను పరిష్కరించడంలో ఏమాత్రం సఫలీకృతం కావడంలేదని విమర్శించారు. నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని ఒకరు దివాకర్ రావు మరొకరు ఆయన తనయుడు నడిపెల్లి విజిత్ రావు అని వారు ఎద్దేవాచేశారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్యా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పుదరి తిరుపతి, మహిళా జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు గజ్జెల హేమలత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మజీద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ రామగిరి బాణేష్, యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు సల్ల మహేష్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వడ్డే రాజమౌళి పాల్గొన్నారు.

టీఎన్జీఓ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీఓ శ్రీపతి బాపురావు, టీఎన్జీఓ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లూరి లక్ష్మయ్య, తహసీల్దార్ రాజ్ కుమార్, ఎపీఎం ఉమారాణి, సీనియర్ సహాయకులు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో సోమవారం మన కుటుంబం క్యాలెండర్ ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు చేతుల మీదుగా క్యాలెండర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేంరావు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, జాగతి మండల అధ్యక్షుడు సోదారి సురేశ్, అధికార ప్రతినిది గంగాధరి రాజకుమార్, కోశాధికారి కనక వంశీ, కోకన్వీనర్ పోలిగాని గంగా, జీపీ అధ్యక్షురాలు పెద్దపల్లి శ్రీవాణి, రత్నం వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బేల : మండలంలోని పిట్‌గావ్ గ్రామానికి చెందిన రాథోడ్ మారుతి ఇటీవల మృతి చెందాడు. ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రావుత్ మనోహర్‌తో కలిసి సోమవారం మారుతీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు ఠాక్రే గంభీర్, మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, మంగేష్ ఠాక్రె, గోడం సునీల్, మస్కె తేజరావు, గోడె మధుకర్ పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

గల్ఫ్ కార్మికుల సహాయం కోసం రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న, రాంపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు, కొత్తకొండ శేఖర్ అన్నారు. సోమవారం రాంపూర్ గ్రామానికి చెందిన గజల్ చరంజీవికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో గ్రామ అసోసియేషన్ సభ్యులు విరాళాలు సేకరించి రూ.22,200 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ బాధ్యులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. నూతనంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బొంబాయి, బొగ్గు భాయి, దుబాయి వలసలు లేకుండా, చేస్తామని నమ్మబలికి గద్దెనెక్కిన కేసీఆర్ గల్ఫ్ కార్మికుల ఊసే ఎత్తడం లేదన్నారు. గల్ఫ్ దేశాలకు కూలి కోసం వలస వెళ్లి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి శవాలను తేవడానికి కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణం అన్నారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో వేముల సత్తయ్య, లింగాల వెంకటేష్, భూపెల్లి లచ్చన్న, సంగెపు వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాసిపేట

నేపాల్‌లో ఫిబ్రవరి 22 నుంచి 24 వరకు నిర్వహించే ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ క్రికెట్ కప్ 2023 ఛాంపియన్ షిప్ పోటీలకుకు ఎంపికైన కాసిపేట మండలం ముత్యంపల్లికి చెందిన పోలవేణి రాకేశ్, బోయిని శివసాయిలకు ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు అవసరం ఉండగా వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి తమ వంతుగా రూ.20 వేలు సహాయం అందించారు. ముందుగా ఎంపికైన క్రీడాకారులకు సన్మానం చేసి ఎసై గంగారాం చేతుల ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు చిన్న ధర్మారం షేక్ సద్దాం క్రికెట్ జట్టు తరుపున రూ.10 వేలు అందించారు.

జాతి అభివృద్ధికి పాటుపడే వారిని ఎన్నుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

ఆదివాసీ సంఘం నాయకునిగా జాతి అభివృద్ధి కోసం పాటుపడే వారిని ఎన్నుకోవాలని ఆదివాసీ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్రం రవీందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఆదివాసి సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షతన వహించిన ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీ కాలపరిమితి ముగిసినందున నూతన కమిటీని జిల్లా కేంద్రంలో ఎన్నుకోనున్నట్టు తెలిపారు. అన్ని గ్రామాల కుల పెద్దలు, మేధావులు, పటేల్లు, ఉద్యోగులు హాజరై మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. అదేవిదంగా ప్రభుత్వం అనేక రకాల ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేస్తోందని, ఆదివాసీ నిరుద్యోగులు బాగా కష్ట పడి చదువాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ మర్సుకోల బాపు రావు, ఆత్రం మారు పటేల్, మారసుకోలా గోపాల్, కుడిమేత తిరుపతి, కుర్సెంగ శంకర్, వల్క చిలుకయ్య, ఆత్రం వెంకట్ రాజం, మార్సుకోలా సరస్వతి, ఆత్రం రాజయ్య, కొడప ప్రభాకర్, కుడిమేత సురేష్, కుర్సెంగ వెంకటేష్, కుడిమేత తిరుపతి, భీంరావ్ పాల్గొన్నారు.

న్యాక్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఉచిత శిక్షణను ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని స్థానిక శిశు మందిర్‌లో న్యాక్ 15 రోజుల శిక్షణ శిబిరాన్ని చైర్మన్ కాంతయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించడానికి ప్రభుత్వం 1998లో న్యాక్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగంలో నైపుణ్యం, నైపుణ్యాభివద్ధి లో మానవ వనరులను, వాటి ప్రాధాన్యతను వెలికి తీయడానికే ఈ సంస్థ పని చేస్తుందన్నారు. నిరుద్యోగ యువత, వర్కర్స్, ట్రేడర్స్, నిర్మాణ రంగం కాంట్రాక్టర్స్ ఉపాధి కోసం ప్రభుత్వం ఏటా ఉచిత శిక్షణ ఇస్తుందని తెలిపారు. అంతేకాకుండా లేబర్‌కు గుర్తింపు కార్డ్స్ ఇచ్చి పని సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.లక్ష 30 వేలు, పెళ్ళి, ప్రసూతి కానుకగా రూ.30వేలు అందిస్తోందన్నారు. లేబర్ కార్డు లేని వారు తనను సంప్రదిస్తే కార్డు వచ్చేలా సహకారం అందిస్తామని స్కీం గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాక్ సిబ్బంది స్వప్న, ఎలక్ట్రికల్ ఇన్స్ట్రక్టర్ శంకర్ పాల్గొన్నారు.

బెంగాల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బేల

బెంగాల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోరారు. సోమవారం బేల ఎస్సైకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న బెంగాల్ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సీజన్ మట్టుకు మాత్రమే బెంగాల్ నుంచి వస్తారని అన్నారు. వీరు మండలంలోని పలు అమాయక ఆదివాసీ గిరిజన గ్రామాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు ఏర్పాటు చేసుకొని వైద్యం పేరుతో కీళ్ల నొప్పులు, మొకాళ్లలో ఇంజక్షన్లు ఇస్తున్నారని అన్నారు. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చెప్రాల, సొన్‌కాస్, మశాల(బి)గూడ, దహెగాం, బేదోడ గ్రామాలలో అమాయక ప్రజలు కిడ్నీలను కోల్పోయే విధంగా వైద్యం చేస్తున్నారని అన్నారు. ఇలా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే బెంగాల్ వైద్యులపై కఠిన చర్యలు తీసుకొని వారిపైన కేసులు పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఎస్సైని కలిసిన వారిలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రకాంత్, ఎండీ అఖిల్, రాకేష్ బన్కర్ ఉన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

నవతెలంగాణ-కడెం

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహనికి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మా గాంధీని దేశప్రజలు ఎప్పటికీ మరువమని ఆయన దేశానికీ చేసిన సేవలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షేక్ రఫీక్, వాజీద్‌ఖాన్, సలీం, భూషణం, బబ్లు, శ్రీకాంత్, యాదగిరి, సీనియర్ నాయకులు రహీం, సత్యం చారి, అశోక్, బ్రహ్మచారి, చాంద్ పాషా ఉన్నారు.

నాగోబా జాతర ఆదాయం రూ.21 లక్షలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని నాగోబా జాతర ఆదాయం రూ.21,37,013 వచ్చినట్లు ఈఓ రాజమౌళి, రవికుమార్ తెలిపారు. నాగోబా ఆదాయాన్ని సోమవారం నాగోబా కమిటీ, మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు కట్నకానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయం రూ.8,94,835 రాగా, తైబజార్ ద్వారా రూ.12,42,138 రాగా మొత్తం రూ.21,37,013 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వెండి 340 గ్రాములు రాగా, బంగారం కొద్దిగానే వచ్చిందని ఈఓ పేర్కొన్నారు.